# మినీ కథలు

## ప్రేమ తెలియని మనుషులు

'కరుణాకరుణ'




మోహన్‌బాబు పర్సులో వుండే ఫొటో నళినిది. నళిని అతనికి అర్ధాంగి. ఆరాధ్యదేవత. అతడామెకు హృదయేశ్వరుడు.

వారి దాంపత్యం అన్యోన్యమే కాదు. ఆదర్శప్రాయం కూడా. అతనామెను ఒక్క క్షణం కూడా వదిలి వుండలేదంటే కేవలం శృంగారమే అందుక్కారణం అనుకోవద్దు.... ఆమె నడక, చూపులు, మాటలు— ఆమె వునికే ప్రేమోత్తేజం కలిగిస్తుందతనికి.

వివాహమైన ఈ మూడేళ్ళలోనూ అతడు ఆమె తోడు లేకుండా ఒక సినిమా చూడలేదు. ఒక హోటల్ కెళ్ళలేదు ఆమెతోనే అతని వినోదం వెళ్ళక తప్పదు కదా అని ఆమె అతణ్ణి బాహుబంధంనుంచి విముక్తుణ్ణి చేసి పంపిస్తేకాని ఆఫీసుకి కదలడు. సాయంత్రం ఎప్పుడయిదవుతుందో, ఎంత తొందరగా పర్మిషన్ తీసుకుని రావటానికి వీలవుతుందో- అంత తొందరగా యింటికి వచ్చేస్తాడు. ఆఫీసులో వున్నంతసేపూ ఆమెను గురించే ధ్యానిస్తాడు. మాటిమాటికీ పర్సు తీసి చూసుకుంటాడు. ఇంట్లో వున్న ఆ కాసేపూ ఆమె అతడి ఫొటోనే పూజిస్తుంది.

ఇరవయ్యేళ్ళు పుట్టింట్లో— ఆ సందడిలో గడిపిన ఆ నళినిని భర్త ఆరాధన వుక్కిరిబిక్కిరి చేసింది. తల్లిదండ్రులకున్న పదిమంది పిల్లల్లో తను అయిదవది. అందువల్ల గారాబమంటే తెలియదు. ఇంటి రొటీన్ అంతా ఓ షెడ్యూలు ప్రకారం జరిగిపోవాల్సిందే. దేనికైనా జట్లు జట్లుగా కూర్చోవటం. పండగలొస్తే ఓ చవకరకం గుడ్డ కొని అందరికీ యూనిఫారాల్లాగా కుట్టించెయ్యటం — ఒకరికీ పెళ్ళిళ్ళ దగ్గర కూడా ఎవరికీ ఏ ప్రత్యేకతా చూపించలేదు వాళ్ళు. అందరికే తలా ఐదువేలకట్నమిచ్చి వచ్చినవాడికి కట్టబెట్టారు.

అలాంటి బెటాలియన్ బ్రతుకు నుంచి— తననూ, తన ఉనికినీ, తన ప్రతి కదలికనూ ఆరాధించే భర్త సన్నిధికి రావడంతో నళినికి వూపిరి సలపలేదు. తనెంతో అందంగా ఉన్నదనీ, తన నడక తీరు బావుంటుందనీ, తన మాటలు మృదువుగా, చూపులు చిలిపిగా వుంటాయనీ ఆమెకెవరూ అప్పటిదాకా చెప్పలేదు.

పొదుపు లేకపోతే సంసారమే గడవని ఇంట్లో పెరిగింది. ఇక్కడ విలాసాలు. షికార్లు. అడగక్కర్లేకుండానే చీరలు. సినిమాలు, హోటళ్ళ టిఫిన్లు ఐస్క్రీంలు.

అలా వాళ్ళ ప్రేమ జీవితం నిరాటంకంగా. థ్రిల్లింగ్ రొటీన్‌గా 'ఎవరోడినా బిగి కౌగిలి శిక్ష'గా పందాలు వేసుకుంటూ సాగింది. మొగ్గ తొడిగిన ప్రేమ మూడేళ్ళ తర్వాత కాయ కాసింది. నళినికి నెల తప్పింది.

"నా హృదయేశ్వరీ! పురిటికి నువ్వు మీ వాళ్ళింటికి వెళ్ళొద్దు. అక్కడ నిన్నెవరు శ్రద్ధగా చూస్తారు? నీ గురించి ఎవరు పట్టించుకుంటారు?" అన్నాడు మోహన్‌బాబు.

"నాకూ వెళ్ళాలని లేదు. కాని మొదటిసారి పుట్టింటివాళ్ళు తీసికెళ్ళటం ఆనవాయితీ. ఏదో అందరికీ చేసినట్టుగా నాకూ చేస్తారు" అంది నళిని.

"ఆనవాయితీలకన్నా ఆరోగ్యం ముఖ్యం. ఇక్కడయితే మంచిమంచి స్పెషలిస్టులున్నారు. నర్సింగ్ హోంలున్నాయి. ఆ పల్లెటూరికి నిన్ను పంపించటానికి నేనొప్పుకోను."

నళిని కాదనలేకపోయింది. అతణ్ణి విడిచి వుండటం ఆమెకు మాత్రం యిష్టమా?

నళిని పుట్టింటివాళ్ళు వచ్చి, అడిగి, కూతురిచేత "రాన"నిపించుకుని వెళ్ళిపోయారు.

డాక్టరు చెప్పినట్టుగానే నళినికి తొమ్మిది నెలల పదిరోజులకు సిటీలోని నర్సింగ్ హోంలో కాన్పు జరిగింది.

ఆ నాలుగు రోజులూ మోహన్‌బాబు ఆమె పక్కనుండి కదల్లేదు.

ప్రైవేట్ నర్సింగ్ హోంలో డబ్బులు తీసుకుని కూడా నర్సులు విసుక్కున్నారు. "ఎవరన్నా ఆడవాళ్ళుంటే రమ్మనండి. ఆమె పక్కనో మనిషుండాలి." అన్నారు.

వార్త తెలిసి, నళిని తల్లి వచ్చింది. పసిబిడ్డను ఎలా ఎత్తుకోవాలో నళినికి తెలియదు. ఆమె బాత్‌రూంకు వెళ్ళడం వగైరాల్లో, భర్త సహాయం చెయ్యలేని పనులన్నీ తల్లి చేసింది.

కొన్నాళ్ళదాకా నళిని బెడ్ పైనుంచి లేవలేకపోయింది. అందువల్ల ఆమె అవసరాలన్నీ అక్కడే జరిగాయి. నెత్తురూ, యిబ్బందులూ చూసి మోహన్‌బాబుకు అసహ్యమేసింది.

నెలరోజు లక్కడే వుండి, కూతురికి విశ్రాంతి అవసరమని పుట్టింటికి తీసికెళ్ళింది ఆమె తల్లి. ఒంటరిగా కూర్చుని— అత్తగారు రాకపోయినట్టయితే తను చెయ్యాల్సివచ్చే పనుల గురించి ఆలోచించుకుంటే మోహన్‌బాబుకు ఒళ్ళు జలదరించింది. అందులోని వెగటూ, మురికీ, ఒళ్ళు హూనమయ్యేట్టుగా చాకిరీ చెయ్యడమూ— యింకా ఇక్కడ రాయలేని పనులు చాలా వూహించుకున్నాడు.